







The

The page yc
changed, or

Please try th

- If yo
that
- Oper
look
- Click
- Click

HTTP 400 -
Internet Exp

## ఆడుకోండి ఆదుకోండి

కంప్యూటర్ ముందు కూర్చుని ఇంటర్‌నెట్లో దేని గురించో వెదుకుతుంటాం. ఆ వెబ్‌సైట్ ఎంతకీ ఓపెన్ కాదు. స్నేహితుడికో మరొకరికో మెయిల్ చేస్తుంటాం. ఫొటోలు ఎంతసేపటికీ వెళ్లవు. తీరికదొరికినప్పుడల్లా గేమ్స్ మొదలుపెడతాం. పాటలు వింటాం. అలా బోర్‌కొట్టినప్పుడో ఇలా తీరిక దొరికినప్పుడో పైసా ఖర్చులేకుండా నలుగురికీ సాయం చేస్తే... అదీ ఆన్‌లైన్లో!



ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఆకలి, తత్సంబంధ కారణాల వల్ల ప్రతిరోజూ 30వేలకుపైగా చనిపోతున్నారు. వారిలో అత్యధికులు చిన్నారులే!

ప్రపంచంలో ఇప్పటికీ సగానికిపైగా ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందడం లేదు.

ఆఫ్రికా, ఆసియాల్లోని వెనుకబడిన దేశాల్లో కొన్ని లక్షలమంది క్యాన్సర్ బాధితులు వైద్యపరీక్షలన్న మాట వినకుండానే కన్నుమూస్తున్నారు. ఇవన్నీ ప్రతి మనిషినీ కదిలించే వాస్తవాలు. 'కానీ, మనం ఏం చేయగలం? '... ప్రతి ఒక్కరికీ వచ్చే మొదటి సందేహమిదే. ఇలాంటి వాళ్లందరికీ సాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలతోపాటు వెబ్‌సైట్లూ వచ్చాయి. కొన్ని సైట్లను, సెర్చి ఇంజిన్లను ఓపెన్ చేస్తే చాలు... డబ్బో బియ్యమో బాధితులకు అందుతాయి. 'మంచిదేగానీ, ఇందులో థ్రిల్ ఏముంది' అనుకునేవాళ్లకోసం ఇప్పుడొచ్చాయి ఆన్‌లైన్ ఆటలు!

### ఉచితాన్నం

ఆటలాడుతూ నలుగురికి విద్యాదానం చేయాలనుకుంటున్నారా? ఎంతోమంది అన్నార్తుల ఆకలి తీర్చాలనుకుంటున్నారా? అయితే www.freerice.com ఓపెన్ చేయండి. దీన్ని 'ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం' నిర్వహిస్తోంది.

ఇందులోని ఆటలన్నీ మెదడుకు మేతపెట్టేవే. ప్రముఖుల పెయింటింగులను చూపించి ఎవరిదో గుర్తించమంటారు. రసాయనశాస్త్రం, లెక్కలకు సంబంధించి ప్రాథమిక ప్రశ్న లుంటాయి. ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలపై పట్టు సాధించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచ పటంలో ఆయా ప్రాంతాలను గుర్తించే ఆట కూడా ఇందులో ఉంది. ఏ విభాగంలోనయినా ఒకసారి సరైన సమాధానం చెబితే 10 బియ్యపు గింజలు మనం ఇచ్చినట్లే. అంటే... మన తరపున స్పాన్సర్లు ఐ.రా.స.కు ఇస్తారన్నమాట. ఉగాండాలోని 66వేల మంది విద్యార్థులకు వారం రోజులపాటు, మయన్మార్‌లోని 7.5 లక్షల తుపాను బాధితులకు మూడురోజులు... ఇలా అనేక దేశాలకు ఈ బియ్యం వెళ్లాయి.

పదాలతో ఆటలాడుకుంటూ నిరుపేద చిన్నారులకు సాయం చేస్తుంది aidtochildren.com ఇందులో ఆంగ్ల పదాల అర్థాలను గుర్తించాలి. సరైన సమాధానం చెప్పిన ప్రతిసారీ 0.25 సెంట్లు ఇచ్చినట్లే. ఇదో వరల్డ్ విజన్' సంస్థతో కలిసి పని చేస్తుంది. ప్రపంచంలో చిన్నారులకు ఆహారం, విద్య, దుస్తులు, ఉపాధికి అవసరమయ్యే వస్తువులు ఇవ్వడం... ఇలా అన్ని అంశాల్లోనూ సాయం చేస్తుంది వరల్డ్ విజన్.

రొటీన్‌కుభిన్నంగాఅన్నట్లు freeflour.com వెబ్‌సైట్ బియ్యానికి బదులు గోధుమలు ఇస్తుంది. ఇందులో భూగోళశాస్త్రంపై ప్రశ్నలతో క్విజ్ ఉంటుంది.

వీడియోగేమ్స్ ఆడుతూ సాయం కూడా చేస్తే! ఆ అవకాశం కల్పిస్తుంది clicktoaid.sg. ఇందులో తేడాలు గుర్తించే పజిల్స్ ఉంటాయి. పదాలకు అర్థాలు తెలుసుకోవచ్చు. ఇంకా అనేక ఆటలున్నాయి. ఇందులో మీరు గెల్చుకున్న ప్రతి 10 పాయింట్లకీ నిరుపేద విద్యార్థుల చదువుకోసం 10 సెంట్లు వెచ్చించినట్టే. ఇది కేవలం సింగపూర్‌కే పరిమితం.

ఇలాంటివే puzzledonate.com; clickforachange.com ఈ వెబ్‌సైట్లలో జిగ్‌సా పజిల్స్, ఇంకా అనేక రకాల ఆటలూ ఉంటాయి.

*మంచినీళ్లు ఇవ్వండి*

ఆహారం లేకపోతే మంచినీళ్లు తాగి రోజులు గడిపేవాళ్లుంటారు. ఆ గ్లాసుడు నీళ్లూ దొరకనివాళ్ల సంగతి? వాళ్లందరికీ మేమున్నాం అంటోంది www.freepoverty.com




ఇందులో ప్రశ్నలో చూపించిన ప్రాంతాన్ని ప్రపంచపటంపై గుర్తించాలి. అలా కరెక్టుగా గుర్తించిన ప్రతిసారీ మీరు పది గ్లాసుల నీటిని దాహార్తులకు ఇచ్చినట్లే. మీరు ఆ ప్రాంతానికి కాస్త అటూ ఇటుగా గుర్తించినా ఫర్వాలేదు. ఆ 'అటూ ఇటూ'ను బట్టి 9, 8, 7,...1 ఇలా గ్లాసుల నీళ్లు అందించినట్టే. ఇప్పటివరకూ ఈ వెబ్‌సైట్ ద్వారా సుమారు 13 కోట్ల గ్లాసుల మంచినీళ్లు దాహార్తులకు అందాయి.

helpthirst.comకూడా అచ్చం ఇలాగే చేస్తుంది. ఇది జ్ఞాపకశక్తికి పదునుపెట్టే వెబ్‌సైట్. ఇందులో జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ఒక ప్రశ్నకు సమాధానాన్ని పెట్టి, మళ్లీ వెంటనే తీసేస్తారు. ఆ తరవాత సమాధానాన్ని మనం మళ్లీ వేయాల్సి ఉంటుంది.

అలా సరిగ్గా వేస్తే ఒక కప్పు నీటినో వరల్డ్ విజన్' సంస్థకు మనం ఇచ్చినట్లే.

*ఏదయినా...*

పర్యావరణానికి మేలు చేయాలన్నా అన్నార్తుల ఆకలి తీర్చాలన్నా చిన్నారులకు చదువు చెప్పించాలన్నా... ఇలా ఏ సాయమయినా ఒకే వెబ్‌సైట్‌లో చేయాలనుకుంటే charitii.comలో ఆడాల్సిందే. ఇందులో కూడా పదసంపత్తిని పెంచేవి, జనరల్ నాలెడ్జ్‌ను పరీక్షించేవి చాలా ప్రశ్నలుంటాయి.

సరైన సమాధానం చెప్పి 10 ఔన్సుల మంచినీరు ఇవ్వొచ్చు. 10 గోధుమ గింజలు ఇవ్వొచ్చు. 10 చదరపు అంగుళాల అటవీప్రాంతాన్ని నాశనం కాకుండా కాపాడొచ్చు. ఒక నిరుపేద విద్యార్థికి పది నిమిషాలు స్కూల్లో చదువుకునే అవకాశం కల్పించొచ్చు. వీటిలో మీకు ఏది నచ్చితే అది చేయొచ్చు.

శారీరక, మానసిక వైకల్యాలతో బాల్యం శాపంగా పరిణమించిన చిన్నారులకు సాయం చేయాలంటే కొవ్వొత్తులు వెలిగించే ఆట ఆడాల్సిందే. అంటే... thecandlegame.comఓపెన్ చేయాలి మరి! ఇందులో నిర్దిష్ట సమయంలో చకచకా కొవ్వొత్తులు వెలిగించాలి. అన్నీ వెలిగిస్తే 10 సెంట్లు సాయం చేసినట్లే.

చూశారా... మనసుంటే మార్గముంటుంది అన్నట్లు సాయం చేయాలనుకుంటే ఎన్ని వెబ్‌సైట్లున్నాయో. ఇంకెందుకు ఆలస్యం... ఆడుతూ పాడుతూ మీరూ ఓ నలుగురికి సాయం చేయండి. వీలైతే వీటి గురించి మరో నలుగురికి చెప్పి పరోక్షంగానూ మీ సాయం కోటాను పెంచేసుకోండి.

PREVIOUS NEXT

| | | |
|---|---|---|
| **Your Mail Id :** | | |
| **Mail This Link To email id :** | | Send Link |